

పరిగి సబ్‌జైలులో రైతులను కలిసిన అనంతరం బాధిత కుటుంబాలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

# లగచర్ల ఘటనను బీఆర్‌ఎస్‌పై నెట్టే కుట్ర

- ఇంటెలిజెన్స్, పోలీస్ వైఫల్యం
- బీఆర్‌ఎస్ నేతలపైనే కేసులు
- నరేందర్‌రెడ్డి అరెస్టు అక్రమం
- సర్కార్ డైవర్షన్ పాలిటిక్స్
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- పరిగి జైలులో రైతులకు పరామర్శ

పరిగి, నవంబర్ 14: లగచర్ల ఘటనను కాంగ్రెస్ సర్కారు కావాలనే బీఆర్‌ఎస్ పార్టీపై నెట్టేందుకు కుట్ర పన్నుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పీ సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. అందుకోసమే అదుపులోకి తీసుకున్న వారిలో కాంగ్రెస్ వారిని పక్కనబెట్టి బీఆర్‌ఎస్‌కు చెందిన వారినే పోలీసులతో అరెస్టు చేయించిందని విమర్శించారు. ఇంటెలిజెన్స్, పోలీస్ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్‌పై నెపం నెడుతున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల ఘటనలో అరెస్టయిన రైతులను గురువారం వికారాబాద్ జిల్లా పరిగిలోని సబ్ జైలులో ఎమ్మెల్యే కోవా లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, హరిప్రియానాయక్‌తో కలిసి సబితారెడ్డి పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రజాభిప్రాయ సేకరణ స్థలంలోనే పోలీసులను వదిలి కలెక్టర్ గ్రామంలోకి ఎందుకు వెళ్లారని, దీనిని బట్టి చూస్తే కావాలనే డ్రామా ఆడారని అర్థమవుతున్నదని చెప్పారు. రాజకీయ లబ్ధికోసమే ప్రభుత్వం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని అరెస్టు చేయడంతోపాటు ఈ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇరికించాలని యత్నిస్తున్నదని విమర్శించారు. జైలులో ఉన్న రైతులు, బయట వారి కుటుంబసభ్యులను చూస్తుంటే కన్నీళ్లు ఆగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో రైతులు, అధికారులు ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. లగచర్ల ఘటనలో పాల్గొనని వారినీ అరెస్టు చేశారని విమర్శించారు.

# ప్రశ్నిస్తే కేసులు పెడ్తరా?

## ఇందిరమ్మ రాజ్యంలో ఎమర్జెన్సీ పాలన.. పట్నంపై కుట్రపూరితంగానే కేసు: హరీశ్

- రిమాండ్ రిపోర్టుపై బలవంతంగా సంతకం
- రైతుల భూములు గుంజుకోవడమేనా ప్రజాస్వామ్యం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- చర్లపల్లి జైలులో పట్నంతో బీఆర్‌ఎస్ బృందం భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, ఫారుఖ్‌హుస్సేన్ తదితరులు

హైదరాబాద్ సిటీబ్యూరో/చర్లపల్లి, నవంబర్ 14(నమస్తే తెలంగాణ): పట్నం నరేందర్‌రెడ్డి అరెస్ట్ ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని, తన ప్రత్యర్థిగా ఉన్న పట్నంపై ప్రతీకారంతో రేవంత్ కుట్రపూరితంగా అరెస్ట్ చేయించారని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే మేలు జరుగుతుందనుకున్న పాపానికి లగచర్ల గిరిజనుల భూములను గుంజుకోవడమే వారికి నువ్వు చేసే మేలా అని సీఎంను ప్రశ్నించారు. కొడంగల్ నుంచే ప్రజాపాలనమీద ప్రజల తిరుగుబాటు మొదలైందని, రేవంత్‌ను గద్దె దించే వరకు నిద్రపోమని హెచ్చరించారు. లగచర్ల కేసులో అరెస్టయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డితో గురువారం చర్లపల్లి సెంట్రల్ జైలులో హరీశ్‌రావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి, నందికంటి శ్రీధర్ ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా పట్నంను పరామర్శించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జైలువద్ద హరీశ్‌రావు మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక కేటీఆర్‌పై కూడా కుట్రలు చేస్తున్నారని, ప్రజలకు ఇబ్బంది తలెత్తినప్పుడు ప్రతిపక్షనేతలుగా ప్రశ్నిస్తే కేసులు పెట్టి ఇరికిస్తారా? రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఎక్కడుందని ప్రశ్నించారు. కొంత కాలంగా లగచర్లలో రైతులు ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని పోరాటాలు చేస్తున్నారని, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోకపోగా గూండాలు, రాజకీయ నాయకులతో బెదిరింపులకు గురిచేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. లగచర్లలో అక్రమ కేసులకు భయపడి రైతులు ఊరి నుంచి పిల్లపాపలతో తరలిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులకు అండగా నిలిచిన పట్నం నరేందర్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకపోయినా అక్రమ కేసులు బనాయించారని మండిపడ్డారు.

### ఏం జరిగినా బీఆర్‌ఎస్‌కు అంటగడ్తరా?

రాష్ట్రంలో ఎక్కడ ఏ ఉద్యమం జరిగినా, ఎవరు నిరసన వ్యక్తం చేసినా బీఆర్‌ఎస్ చేయిస్తున్నదని అంటున్నారని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. నిరుద్యోగులు, రైతులు, స్పెషల్ పోలీసులు, హాస్టల్ విద్యార్థులు తమ సమస్యలపై స్వచ్ఛందంగా ధర్నా చేస్తే అది బీఆర్‌ఎస్ చేయించిందని రేవంత్ అంటున్నారని పేర్కొన్నారు. రేవంత్ సొంత నియోజకవర్గంలో తమ భూముల కోసం గిరిజనులు పోరాటం చేస్తే అది కూడా బీఆర్‌ఎస్ చేసిందనే అంటున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మల్లన్నసాగర్‌లో రేవంత్‌రెడ్డి రెండురోజుల పాటు నిరసన చేస్తే తాము ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించామని గుర్తుచేశారు. అర్ధరాత్రి మహిళల చాతీమీద కాళ్లు పెట్టి అరెస్టులు చేయడం సరికాదని హితవు పలికారు. లగచర్లకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు మధుసూదనాచారి, ఆర్‌ఎస్ ప్రవీణ్, కార్తీక్‌రెడ్డితో పాటు బీజేపీ నాయకురాలు డీకే అరుణను అడ్డుకోవడం సరికాదన్నారు. తననో, కేటీఆర్‌నో, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలనో అరెస్ట్ చేయండి, కానీ గిరిజన రైతులను అరెస్టు చేయడం సరికాదని, అక్రమంగా అరెస్ట్ చేసిన గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

> నరేందర్‌రెడ్డికి ఈ కేసుతో సంబంధం లేదు. రిమాండ్ రిపోర్ట్‌లో ఏముందో ఆయనకు తెలియదు. మేజిస్ట్రేట్ ముందు తనను హాజరుపరచడానికి ఒక్క నిముషం ముందు తనపై ఒత్తిడి చేసి సంతకం పెట్టించినట్టు నరేందర్ రెడ్డి నాతో చెప్పారు. కేటీఆర్‌తో పట్నం ఫోన్‌కాల్స్‌పై కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.
> -హరీశ్‌రావు

> ప్రజలకు అన్యాయం జరిగితే పోరాడటం ప్రతిపక్షంగా మా బాధ్యత. మాపై కోపం ఉంటే మమ్మల్ని అరెస్ట్ చేయాలి తప్ప అమాయక గిరిజన రైతులపై కేసులెలా పెడతారు? మాపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపాలని అనుకుంటున్నారు. మాకు జైళ్లు, కేసులు కొత్త కాదు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులు ఎదుర్కొన్నాం, జైళ్లకు కూడా వెళ్లొచ్చాం. -హరీశ్

### భూములు గుంజుకుంటారా!

పీడిత వర్గాల ప్రజలకు అండగా నిలబడటమే తన బాధ్యత అని హరీశ్ అన్నారు. దేశంలో నాటి ఇందిరమ్మ ఎమర్జెన్సీ పాలన నేడు రాష్ట్రంలో మళ్లీ కనిపిస్తుందని విమర్శించారు. ఇందిరమ్మ ముసుగులో దళితులు, గిరిజనుల భూములు గుంజుకుంటున్నారని, రైతుల భూములు గుంజుకోవడమే ఇందిరమ్మ పాలనా అని నిలదీశారు. తొమ్మిది నెలల గర్భిణి, మహిళల ఛాతీ మీద తొక్కుకుంటూ పోలీసులు ఇంట్లోకి వెళ్లారని, ఇదేనా ప్రజాపాలన అని నిలదీశారు. రేవంత్ సొంత నియోజకవర్గంలో తనకు ఓట్లేసి గెలిపించిన గిరిజనుల భూములను అన్యాయంగా లాక్కుంటున్నారని, ఎదురుతిరిగిన అమాయక ప్రజలపై కేసులు పెట్టి జైలుకు పంపడం ఎంతవరకు కరెక్టని ప్రశ్నించారు.

### కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నరు

బీఆర్‌ఎస్ పార్టీ పేదల పక్షాన నిలబడుతుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రజలకు సమాధానం చెప్పలేక ప్రశ్నించే గొంతుక కేటీఆర్ మీద కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తనను అనవసరంగా ఇరికించారని, కేటీఆర్‌ను కూడా ఇరికించాలని చూస్తున్నారని పట్నం తనతో చెప్పినట్టు తెలిపారు. నరేందర్‌రెడ్డి ధైర్యంగా ఉన్నారని, ఆయనకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ధర్మమే గెలుస్తుందని, నరేందర్‌రెడ్డి నిర్దోషిగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### మా పాలనలో 14వేల ఎకరాలు సేకరణ

బీఆర్‌ఎస్ పాలనలో హైదరాబాద్‌లో ఫార్మాసిటీ కోసం కేసీఆర్ 14 వేల ఎకరాలు సేకరించారని ఆ భూముల్లో ఫార్మాసిటీ ఎందుకు పెట్టడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. కొడంగల్‌లో ఫార్మాసిటీ కట్టడం ద్వారా గతంలో తాము సేకరించిన ప్రాంతంలో రియల్ ఎస్టేట్ చేయాలన్న కుట్ర జరుగుతున్నదని ఆరోపించారు. పచ్చటి పొలాల్లో రేవంత్‌రెడ్డి చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రేవంత్ పాలన కేవలం అదానీ, తన తమ్ముళ్లు, అల్లుళ్లు, బడాబాబుల కోసమేనని విమర్శించారు.

# రేవంత్‌కు కండ్లు నెత్తికెక్కాయి!

- అహంకారంతో విర్రవీగుతున్నరు
- ప్రతిపక్షంలో ఉండగా తన్ని తరమండన్నవ్
- ఇప్పుడేమో భూములు గుంజుకుంటున్నవ్
- అసలు అధికారులు ఎందుకు వెళ్లారు
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం



హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండ్లు నెత్తికెక్కి మాట్లాడుతున్నారని, అహంకారంతో విర్రవీగుతున్నారని బీజేపీ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి, సర్కారు వైఖరిని తప్పుబట్టారు. భూములు తీసుకోవడానికి వస్తే అధికారులను తన్ని తరమండంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజలకు పిలుపునిచ్చిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే అదే ప్రజల భూములను గుంజుకుంటున్నారని ధ్వజమెత్తారు. లగచర్ల సహా పరిసర గ్రామాల్లో కొందరు దళారులు, మధ్యవర్తులు అసైన్డ్ భూములు పొందిన వారిని బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రూ.40 లక్షల విలువైన భూమిని రూ.10 లక్షలకే గుంజుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రజలు తమ గ్రామాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదంటూ రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా ఆందోళనకు దిగారని తెలిపారు.

### నరేందర్‌రెడ్డి మాటల్లో తప్పేముంది?

మాజీ ఎమ్మెల్యే పట్నం నరేంద్‌రెడ్డి మాట్లాడిన దాంట్లో తప్పేమున్నదని ఈటల రాజేందర్ తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న వాళ్లు కాకపోతే ఎవరు ప్రజలకు అండగా ఉంటారని చెప్పారు. ఇంత బర్నింగ్ ఇష్యూ జరుగుతున్నప్పుడు అసలు అధికారులు గ్రామంలోకి ఎందుకు వెళ్లారని నిలదీశారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల చేత ఛీకొట్టించుకున్నది రేవంత్ సర్కారే అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పాలనలో అధికారదాహంతో ప్రజల భూములు గుంజుకుంటూ, హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడుతూ ప్రజల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమని ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడిని మాత్రం 50 కార్ల కాన్వాయ్‌తో, 300 మందితో గ్రామాల్లో తిరుగుతూ, ప్రజలను దూషిస్తూ.. సంతకాలు పెట్టకుంటే జైళ్లలో మగ్గే పరిస్థితి వస్తుందని భయపెట్టారని తెలిపారు. 1,500 మంది పోలీసులు 4 గ్రామాలపై పడి రాత్రికి రాత్రే పలువురిని అరెస్ట్ చేసి హింసించారని ఆరోపించారు. ప్రజల నుంచి ప్రభుత్వం భూములు సేకరించాలనుకున్నప్పుడు ప్రత్యామ్నాయం చూపించాల్సిందేనని స్పష్టం చేశారు.

# భూములు లాక్కోవడం దుర్మార్గం

## సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్ నాయక్



హైదరాబాద్, నవంబర్14(నమస్తే తెలంగాణ)/చిక్కడపల్లి: కొడంగల్ గిరిజన రైతుల భూములు లాక్కోవడం దుర్మార్గమైన చర్య అని సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు సంజీవ్‌నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఫార్మా కంపెనీల కోసం ముచ్చర్లలో 12 వేల ఎకరాల భూములు ఉండగా, మళ్లీ కొడంగల్‌లో భూసేకరణ ఎందుకని మండిపడ్డారు. గిరిజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'కొడంగల్ ఫార్మా-భూముల కేటాయింపు'పై నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటు కోసం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్‌నాయక్ మాట్లాడుతూ.. కొడంగల్ ఫార్మా భూముల కేటాయింపుపై నిజ నిర్ధారణ కమిటీ ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. ఈ కమిటీ కొడంగల్‌లో పర్యటించి వివరాలు సేకరించున్నట్టు చెప్పారు.


CSIR-NATIONAL ENVIRONMENTAL ENGINEERING RESEARCH INSTITUTE (NEERI),
HYDERABAD ZONAL CENTRE (HZC)
(An ISO 9001:2008 certified organization)
IICT Campus, Tarnaka, Hyderabad – 500 007
Website : http://www.neeri.res.in

ENGAGEMENT OF PROJECT PERSONNEL UNDER SPONSORED PROJECTS

ADVERTISEMENT NOs. RECRUIT_V6_6D_HYDERABAD_28102024,
RECRUIT_V6_6D_HYDERABAD_28102024_B
RECRUIT_V6_6D_HYDERABAD_28102024_C,
RECRUIT_V6_6D_HYDERABAD_28102024_D,
RECRUIT_V6_6D_HYDERABAD_28102024_E,
RECRUIT_V6_6D_HYDERABAD_28102024_F,
RECRUIT_V6_6D_HYDERABAD_28102024_G

Applications from eligible & interested candidates are invited via WALK IN INTERVIEW on Nobember 19, 2024 from 9.30 am onwards at CSIR NEERI, HZC, IICT campus, Tarnaka, Hyderabad 500007 for engagement of PA I (01 no.), PA II (9 no.s) and PA III (01 no.) on purely temporary basis under various sponsored projects tenable at CSIR NEERI, Hyderabad Zonal Centre. For essential qualification, job requirement and remuneration the full advertisement may be seen on the above website of the Institute under the caption "Recruitment".

Project Leader




వాంకిడిలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మాలీ సంఘం నాయకులు

# శైలజకు కార్పొరేట్ వైద్యం అందించాలి

- ఫుడ్‌పాయిజన్ విద్యార్థిని ఆరోగ్యంపై స్పష్టత ఇవ్వాలి
- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మాలీ సంక్షేమ సంఘం
- వాంకిడిలో జాతీయ రహదారిపై రాస్తారోకో

వాంకిడి, నవంబర్ 14: కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలోని ఆశ్రమోన్నత పాఠశాలలో గత నెల 30న ఫుడ్ పాయిజన్‌తో 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా.. అందులో చౌదరి శైలజ పరిస్థితి విషయమంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఆమె ఆరోగ్యంపై పూర్తి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాగపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. విద్యార్థిని శైల జకు కార్పొరేట్ తరహాలో వైద్యమందించాలని, లేని పక్షంలో జరగబోయే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుర్నులే నారాయణ, జిల్లా అధ్యక్షుడు నాగోషే శంకర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు గుర్నులే మెంగాజీ, సంఘం మండల అధ్యక్షుడు వాడై బాబురావు, నాయకులు సోమేశ్వర్, సెండే వాసు, గురునులే మారుతి, మొహుర్లే శ్రీకాంత్, దాభ గ్రామ పటేల్ మొహుర్లే మహేందర్ పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో ప్రొటోకాల్ రగడ

- ఎంపీ, ఎమ్మెల్యే ఫొటో పెట్టలేదని బీజేపీ నేతల ఫైర్
- మంత్రి జూపల్లి పర్యటనకు ముందే మాటల యుద్ధం
- ఫ్లెక్సీ చించివేత.. బీజేపీ, కాంగ్రెస్ నేతల తోపులాట

ఆర్మూర్‌టౌన్, నవంబర్ 14: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన సందర్భంగా ప్రొటోకాల్ వివాదం తలెత్తి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఫ్లెక్సీలో ఎంపీ, ఎమ్మెల్యే ఫొటో పెట్టకపోవడంతో మొదలైన వివాదం బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య బాహాబాహీ చోటుచేసుకుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి ఉమ్మడి నిజామాబాద్‌లోని పెర్కిట్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ అర్వింద్, స్థానిక ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఫొటోలు పెట్టకపోవడంపై బీజేపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తంచేశాయి. అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు కల్పించుకోవడంతో వివాదం మొదలైంది. ఫ్లెక్సీని చించేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా, అధికార పార్టీ నేతలు అడ్డగించేందుకు యత్నించడంతో ఒక్కసారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. అక్కడే ఉన్న పోలీసులు ఇరు వర్గాలను సముదాయించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గొడవ జరుగుతుండగానే బీజేపీ కార్యకర్తలు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఫొటోలు లేని ఫ్లెక్సీలను చించేశారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు పార్టీల నాయకులను సముదాయించి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

# 'ఫార్మా'ను వ్యతిరేకించడం మూర్ఖత్వం: భట్టి

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఫార్మా క్లస్టర్ల విస్తరణను వ్యతిరేకించడం మూర్ఖత్వమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గాంధీభవన్‌లో గురువారం నిర్వహించిన నెహ్రూ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఏమిటో కేటీఆర్ సూచించాలని అన్నారు. తాము కక్షపూరిత రాజకీయాలకు వ్యతిరేకమని, బీఆర్‌ఎస్ ప్రతిపక్షంగా తన పాత్ర పోషించిందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని కూల్చడంపైనే బీఆర్‌ఎస్ దృష్టి పెట్టిందని ఆరోపించారు. స్కీములు పెరగడానికే కులగణన చేస్తున్నట్టు చెప్పారు. కులగణన చేస్తామని మాట ఇచ్చామని, ఇప్పుడు చేసి చూపిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కులగణన ఎంతగానో ఉపయోగపడుతుందని, దేశానికి తెలంగాణ రోల్‌మోడల్ నిలువబోతుందని చెప్పారు.

# రైతులను బలి చేయొద్దు: న్యూడెమోక్రసీ

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు తన రాజకీయ ప్రయోజనం కోసం రైతులను బలి పెట్టాలని చూడటం అన్యాయం, అప్రజాస్వామికమని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొన్నది. వికారాబాద్ జిల్లా లగచర్ల రైతులపై రేవంత్‌రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న నిరంకుశ వైఖరిని ఆ పార్టీ ఖండించింది. లగచర్ల రైతులపై పోలీస్ నిర్బంధాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేసింది. ఫార్మా కంపెనీల కోసం బలవంతపు భూసేకరణ విధానాన్ని రేవంత్ సర్కార్ విడనాడాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. భూములు ఇచ్చేది లేదన్న లగచర్ల రైతులను కుట్రదారులుగా పేర్కొంటూ అరెస్ట్ చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అధికారులపై దాడులు చేశారనే నెపంతో ఊరుపైనే నిర్బంధం కొనసాగించడం అక్రమమన్నారు. తమ భూములు లాక్కుంటారనే అనుమానంతోనే రైతులు ఆగ్రహించారని, ధర్మాగ్రహంలో జరిగిన దాడులను బలవంతంగా భూముల గుంజుకోవడానికి లైసెన్స్‌గా భావించడం చట్టవ్యతిరేకమని పేర్కొన్నారు. భూములు కోల్పోయి.. నిర్వాసితులం అవుతామన్న ఆవేదనతోనే అధికారులపై రైతులు దాడి చేశారని తెలిపారు.

# ఉద్యోగులపై దాడి దుర్మార్గం

## సీసీఎల్‌ఏ కార్యాలయంలో ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ప్రజలకు సేవలందించే ఉద్యోగులపై కొందరు రాజకీయ లబ్ధి కోసం భౌతికదాడులకు పాల్పడటం దుర్మార్గమైన చర్య అని ఉద్యోగుల జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు విమర్శించారు. వికారాబాద్ కలెక్టర్, రెవెన్యూ ఉద్యోగులపై దాడికి నిరసనగా జేఏసీ, ట్రెసా పిలుపు మేరకు గురువారం కోఠిలోని సీసీఎల్‌ఏ కార్యాలయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దాడికి పాల్పడినవారితోపాటు రెచ్చగొట్టినవారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ట్రెసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, గౌతమ్‌కుమార్, టీజీవో ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రమోహన్, టీజీవో అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్ పాల్గొన్నారు.


